క్లుప్తంగా

ప్రజల ఆరోగ్యమే ధ్యేయం



అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్

రేగోడ్(మెదక్): ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావుతో కలిసి మంత్రి దామోదర పంపించిన అంబులెన్స్ వాహనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చాలా సంవత్సరాలుగా అంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేయలేదని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, దామోదరకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వికాస్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, మాజీ ఎంపీటీసీ నరేందర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి పైపుల లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలని, గ్రామాల్లో నర్సరీ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. నర్సరీకి మట్టిని సేకరించి, పాలిథిన్ కవర్లలో నింపాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఉద్యోగులు

టేక్మాల్(మెదక్): పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖ యూనియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాధవచారి డిమాండ్ చేశారు. బుధవారం టేక్మాల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలను, పెండింగ్ బిల్లులను, సూపరింటెండెంట్‌లకు గెజిటెడ్ హోదా కారుణ్య నియామకాలతో పాటూ నూతన పీఆర్‌సీని వెంటనే ప్రభుత్వం అమలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ జూనియర్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు, యూనియన్ నాయకులు హరిసింగ్, రాములు, శ్రీనివాస్, చంద్రగిరి, అఖిల్ అహ్మద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రి ప్రారంభం



రామాయంపేటలో కంటి ఆస్పత్రిని ప్రారంభించిన లయన్స్ క్లబ్ గవర్నర్ నగేశ్

రామాయంపేట(మెదక్): పట్టణంలో బుధవారం స్నేహబంధు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆస్పత్రిని క్లబ్ జిల్లా గవర్నర్ నగేశ్ ప్రారంభించారు. నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సభ్యులు సూచించారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. గవర్నర్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను సమీక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి, క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, దేమె యాదగిరి, సాగర్, గంగారాం, బాల్‌రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమెప్పుడో?

- పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌడిపల్లి మండలంలో ప్రధాన పంట వరి కాగా బోరుబావులు, చెరువు కుంటల కింద 18,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వరికోత పనులు సైతం ఊపందుకున్నాయి. ఓవైపు వరికోతలు ప్రారంభం కాగా, మరోవైపు అకాలవర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా మండలంలో ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. గత ఏడాది ఐకేపీ ఆధ్వర్యంలో 9, పీఏసీఎస్ 13, డీసీఎంఎస్ 4, మొత్తం 26 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



తిమ్మాపూర్‌లో తడిసిన వరిధాన్యాన్ని చూపుతున్న రైతులు



కాడిపల్లి చెరువు కట్టపై ధాన్యం కుప్పలు



కాడిపల్లిలో..

మొక్కుబడిగా మరమ్మతులు

- నాలుగుమార్లు మార్చినా.. పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్



రేగోడ్(మెదక్): పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను నాలుగు సార్లు మరమ్మతు చేసినా.. పనిచేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సుమారు రెండు వందల గృహాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈనెల 17 నుంచి ఇప్పటి వరకు నాలుగుమార్లు ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయింది. తరచూ పాడవుతుండటంతో గ్రామంలోని రెండు వందల గృహాల ప్రజలు రోజూ ఇబ్బందుల పాలవుతున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదని, ఫ్యాన్లు పాడయ్యాయని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ సమస్యతో వారం రోజుల నుంచి కంటిమీద కునుకులేకుండా సతమతమవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరమ్మతుల లోపంతోనే ట్రాన్స్‌ఫార్మర్‌లు సరిగా పని చేయడం లేదా.. అని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ హై ఓల్టేజీతో పని చేస్తుందని, దీంతో ఫ్యాన్లు,ఎలక్ట్రానిక్ వస్తువులు పాడయ్యే అవకాశం లేకపోలేదని అధికారులు చెప్తున్నారు. గతంలో ఇదే విధంగా సమస్య తలెత్తితే సాక్షిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి.. కలెక్టర్ స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ అహ్మద్ మొయినొద్దీన్

చిన్నశంకరంపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొయినొద్దీన్ కోరారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులకు ఓటీపీ చెప్పొద్దని సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ అడిగినప్పుడు అందులో మోసం ఉందని గ్రహించాలన్నారు. సంబంధం లేని, ఆఫర్ పేరిట వచ్చే ఆన్‌లైన్ లింక్‌లను కూడా ఓపెన్ చేయొద్దన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



చేగుంటలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి



ఓటు హక్కును నమోదు చేసుకుంటున్న ఆర్డీవో రమాదేవి

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని స్వచ్ఛందసేవ కార్యక్రమాల నిర్వాహకుడు మామిడి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం చేగుంట, రెడ్డిపల్లి, వడియారం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించి ప్రతి ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉంటానని తనకు ఈసారి ఉపాధ్యాయులు ఓటు వేసి, శాసన మండలికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రఘుపతి, సురేందర్, రాధ, సరస్వతి, శారద, ఉమామహేశ్వర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(తూప్రాన్): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింలు అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఫారం 18, 19లను వారు అందజేశారు. ఆయా ఎన్నికల్లో ప్రధాని మోదీకి మద్దతుగా బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటువేయాలని కోరారు.

ఓటరు నమోదు చేసుకున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు గాను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో 15 మంది ఉపాధ్యాయులు తమ పేర్లను ఓటరు లిస్టులో నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సభ్యులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల జాబితాలో భాగంగా మెదక్ తహసీల్దార్ కార్యాలయంలో మెదక్ ఆర్డీవో రమాదేవి ఓటరుగా తన పేరును నమోదు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫారం-18ని నింపి తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు అందజేశారు. అర్హత గల పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్డీవో సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో స్వీపర్, వాచ్ ఉమెన్(హెల్పర్) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కరస్పాండెంట్ గౌతమి బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు కేజీబీవీలో సంప్రదించాలని, 95426 62227 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

గ్యాస్ డీలర్ల నిలువు దోపిడీ

సిలిండర్‌పై రూ.60 అదనంగా వసూలు

అల్లాదుర్గం(మెదక్): వినియోగదారులను మోసం చేస్తూ గ్యాస్ డీలర్లు అందిన కాడికి దొచుకుంటున్నారు. 10 కాదు.. 20 కాదు ఏకంగా సిలిండర్‌పై రూ.60 అదనంగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. అల్లాదుర్గం మండలంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ లేదు. సంగారెడ్డి జిల్లా జోగిపేట హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ అల్లాదుర్గంలో సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ఒక్క సిలిండర్ రూ.890 విక్రయించాల్సి ఉండగా, రూ.950కి అమ్ము కుంటున్నారని విని యోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.60 అధికంగా ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే డోర్ డెలివరీ చేస్తున్నందుకు అని చెబుతూ దాట వేస్తున్నారని వారు తెలిపారు. గ్యాస్ ఏజన్సీలు స్థానికంగా లేక పోవడంతో డీలర్లుఇష్టం వచ్చినట్లు వ్యవ హరిస్తున్నట్లు వినియోగదారులు మండిపడుతున్నారు. ఈ విషయంపై జోగిపేట గ్యాస్ డీలర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న జీఎమ్మార్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా జీఎమ్మార్ ఏఎస్ఓ చరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సహ ఉద్యోగులంతా కలిసి కొంత నిధిని సేకరించామన్నారు. ఈనిధితో ధాన్ ఉత్సవ్ పేరుతో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నవన్‌కుమార్, ఉపాధ్యాయులు, జీఎమ్మార్ ప్రతినిధులు రామకృష్ణ, శ్రీనివాస్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం

హవేళిఘణాపూర్(మెదక్): పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళ 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. హవేళిఘణాపూర్ మండలం బూర్గుపలి గ్రామానికి చెందిన మంజులకు పురిటి నొప్పులు రాగా మెదక్ ఆస్పత్రికి తరలించగా, ఇక్కడ వసతులు సరిగ్గా లేనందున మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని డాక్టర్లు సూచించారు. దీంతో ఆమె కుటుంబీకులు ఆమెను బుధవారం 108 అంబులెన్సులో నీలోఫర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు వచ్చాయి. దీంతో 108 సిబ్బంది నవీన్‌యాదవ్ చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేయగా, మగ బిడ్డకు జన్మనిచ్చింది.



108 అంబులెన్సులో జన్మించిన శిశువు

అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): చిన్నారులకు వసతుల కల్పనలో భాగంగా ఐటీసీ పరిశ్రమ సహకారంతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రంలో నిర్మించిన భవనాన్ని జిల్లా వెల్ఫేర్ అధికారి హైమావతి, కొండాపూర్‌లో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ విద్యార్థుల కోసం గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ఐటీసీ పరిశ్రమ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఐటీసీ మిషన్ సునేరికాల్ బంగారు భవిష్యత్ పథకంలో భాగంగా సుమారు ఒక్కో భవనం రూ. 10.50 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మెహతాబ్ భేగం, తాజా మాజీ సర్పంచ్ మమత, ఐటీసీ ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్, ఐటీసీ ప్రతినిధులు

అన్నింటికీ బోనస్ ఇవ్వాల్సిందే

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): సన్నరకం, దొడ్డురకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చండి, లచ్చిరెడ్డిగూడం, నవాబుపేట గ్రామాల్లో రామేశ్వరం చండి రైతు ఉత్పత్తిదారుల సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో చండి, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం సన్నరకానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, రైతులకు గత రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యానికి బోనస్ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా మద్దతు ధరతో పాటు రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ కిషన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, మన్సూర్, యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, లక్ష్మణ్, భిక్షపతిరెడ్డి, నర్సింగరావు, ముత్యంరెడ్డి, చింత స్వామి, వెంకటేశ్వర్‌రావు, రామేశ్వరం చండి రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): మంగళపర్తిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్దిదారుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, శ్రీరాములు, బబియానాయక్, బాల్‌రాజ్, సద్దాం, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. ఈ మేరకు వెల్దుర్తి మండలంలోని మంగళపర్తి, వెల్దుర్తి, మానెపల్లి, యశ్వంతరావ్‌పేట, ఎం.జలాల్‌పూర్, యశ్వంతరావ్‌పేట, కుకునూర్, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి నష్టపోకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సిద్ధయ్య పాల్గొన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): చండిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని మండలంలోని జంగరాయి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని జంగరాయి, చందాపూర్, అంబాజీపేట, గవ్వలపల్లి, కొర్విపల్లి గ్రామాల్లో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం సన్న వడ్లకు అందిస్తున్న బోనస్‌ను రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, ఏఈఓ శ్యామ్, సీఈఓ బాలకిష్టయ్య పాల్గొన్నారు.

పోతంశెట్టిపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రమణరావు, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కాశీనాథ్, మెదక్ పట్టణాధ్యక్షుడు ప్రసాద్, మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌చార్జి సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి నాని, మండల కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, గ్రామ బూత్ అధ్యక్షులు మహేశ్, భాస్కర్, నాయకులు గురూజీ, చిరంజీవి, ప్రవీణ్, ఐలేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రోడ్డు పనుల పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి–శేరిపల్లి రోడ్డు పనులకు నిధులు మంజూరు కావడంతో పీఆర్ డీఈ పాండురంగారెడ్డి, ఏఈ విజయ్ కుమార్ పరిశీలించారు. బుధవారం కొర్విపల్లి మెగ్యా తండా రోడ్డును అధికారులు పరిశీలించారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ సహకారంతో ఈ రెండు రోడ్లకు రూ.ఒక కోటి చొప్పున నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు మనోజ్, ప్రభాకర్, నర్సింలుగౌడ్, పుల్లారావు, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

◆ ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి జెడ్పీపాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అయోడిన్ అవసరం, వ్యాధులపై వివరించారు. పాఠశాల హెచ్‌ఎం మురళిమోహన్, సీహెచ్‌ఓ లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శోభ పాల్గొన్నారు.

◆ శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప మాలాధారులు

మనోహరాబాద్(తూప్రాన్): శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప మాలధారులకు మండలంలోని కాళ్లకల్ వద్ద స్థానికులు బుధవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందంర్భంగా గురుస్వామి మాట్లాడుతూ అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచారక్ సేవా సమితి ఆధ్వ ర్యంలో 65 మంది అయ్యప్ప మాలాధారులు నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించి శబరిమలకు వెళ్తున్నామని తెలిపారు.

◆ క్యాన్సర్‌పై అవగాహన

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్, లెక్చరర్లు నర్సింలు, ఫర్జానా, బాలయ్య, నీరజ, లక్ష్మణ్, శ్యాంసుందర్, స్వర్ణలత, లయన్స్ ప్రతినిధులు రాంచంద్రం, నాగరాజు, సూర్యప్రకాశ్, సుఖేందర్ పాల్గొన్నారు.

◆ సెంట్రింగ్ డబ్బాల చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో సెంట్రింగ్ డబ్బాలు చోరీ అయిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్– నర్సాపూర్ హైవే పక్కన పోలీస్ స్టేషన్‌కు దగ్గరలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్లాబు వేసేందుకు సెంట్రింగ్ డబ్బాలు ఆలయ నిర్మాణ పనుల వద్ద ఉంచారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 100 సెంట్రింగ్ డబ్బాలు చోరీ చేశారు. బుధవారం ఉదయం గుర్తించిన మేస్త్రి రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

CSI COLLEGE OF EDUCATION: MEDAK
RED RIDGE, CATHEDRAL COMPOUND, MEDAK

SPOT ADMISSIONS - 2024 (B.Ed)

List of the Candidates given below, having attained allotment by the Convener, TGED-CET 2024 could not avail the admission in to 2 years B.Ed Course in our College. This is to intimate regarding final reporting chance to join in to B.Ed Course on **26.10.2024** before **3.00 PM,** lest their allotment will be cancelled and treated as vacancies to the **SPOT ADMISSIONS** which will be conducted on **28.10.2024** including left over seats as per the norms of **TGED-CET 2024.**

Sl.No.	Rank	Hall Ticket No.	Candidate Name	Methodology	Allotted Category
1	13904	2425409053	NAINI SWATHI	BIOLOGICAL SCIENCE	REG_BCD_UNR_FEMALE
2	14184	2416504037	GANTA SUNITHA	BIOLOGICAL SCIENCE	REG_SC_OU_FEMALE
3	7932	2425401228	CHAKALI ARCHANA	MATHEMATICS	REG_BCA_OU_GEN
4	20196	2425703001	KOMMU SUMATHI	MATHEMATICS	REG_SC_OU_FEMALE
5	26468	2426503030	VALLURI SONY	MATHEMATICS	REG_SC_OU_GEN
6	27779	2415401252	RAMSAMI SARITHA	MATHEMATICS	REG_ST_UNR_GEN
7	27009	2415401257	MOODA JYOTHI	SOCIAL SCIENCE	REG_SC_OU_FEMALE

Eligibility: Pass in Degree and qualified in TG-EDCET-2024 and not taken admission anywhere so far. All original certificates and TC should be handed over at the time of Spot Admission. along with one **(1)** set of photo copies Processing fee and Tuition Fee etc., for 1st year as fixed should be paid in full on the spot otherwise admission will be granted to the next available merit candidate. Interested candidates may attend for Spot Admission on **28.10.2024** at **11.00 AM** in the College.
for any details Contact No. **9392861917 / 9908743996**
Principal / Secretary

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264